క్లుప్తంగా

బెంగళూరుకు స్పెషల్ సర్వీసులు

మదనపల్లె సిటీ: దీపావళిని పురస్కరించుకుని మదనపల్లె నుంచి బెంగళూరుకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆది, సోమవారాల్లో నాలుగు సర్వీసులు నడుపుతామన్నారు. సాధారణ చార్జీలు ఉంటాయని, రద్దీ ఎక్కువగా ఉంటే అదనంగా కూడా బస్సులు నడుపుతామన్నారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కోటి సంతకాల సేకరణ రచ్చబండ

కేవీపల్లె : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మండలంలో శనివారం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు నూతనకాలువ పంచాయతీ, 10.45కు ఎంపీపల్లె పంచాయతీ, మధ్యాహ్నం 12 గంటలకు తువ్వపల్లె పంచాయతీలో కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ


కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న కీర్తన

మదనపల్లె సిటీ: బాలికా దినోత్సవం పురస్కరించుకుని విద్య,ఆరోగ్యశాఖ నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో స్థానిక మయాబజార్ వివేకానంద ఉన్నత పాఠశాల విద్యార్థిని కీర్తన ప్రతిభ కనబరిచారు. పదో తరగతి చదువుతున్న కీర్తన జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి మూడవ స్థానం దక్కించుకుంది. విద్యార్థికి జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ రూ. 2వేలు నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. విద్యార్థిని కీర్తనను శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పురం రమణ తదితరులు అభినందించారు.

టమాటా పంట పరిశీలన


టమాటా పంటను పరిశీలిస్తున్న ఆర్ఎస్‌కే సేవకులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పట్టింవాండ్లపల్లి పంచాయతీ దిగువ కుక్కలపల్లికి చెందిన రెడ్డెం చంద్రారెడ్డి అనే రైతు నాశిరకం టమాటా నారు కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోయాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాక్షి పత్రికలో వెలువడిన నార నాశిరకం..రైతుకు నష్టం వార్తపై అధికారులు స్పందించారు. ఈ తరుణంలో వ్యవసాయ, ఉద్యాన, ఆర్ఎస్‌కే సేవకులు అశ్వినీ షంషీర్ రైతు సాగు చేసిన టమాటా పంటను పరిశీలించారు. రైతు నారుకు వినియోగించిన సీడు, కొనుగోలు చేసిన బిల్లులు, టమాటా పంట స్థితిగతులను సేకరించి ఉన్నతాధికారులకు వివరించారు.

పశువైద్య శిబిరానికి స్పందన


పాడి రైతులకు మినరల్ మిక్చర్ పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పీలేరురూరల్ : మండలంలోని ఎంసీ పాళెంలో పీలేరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం నిర్వహించిన శిబిరంలో డాక్టర్ మునిచంద్ర 70 పశువులకు చికిత్స అందించారు. అనంతరం సుమారు రూ. 10 వేలు విలువైన మందులు, మినరల్ మిక్చర్, ఇంజెక్షన్లు డాక్టర్ టి.వి.ఎస్.ఆర్.కె.వి. ప్రసాద్ సహకారంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బి.ఆర్. నాగబాలాజి, పూర్వపు అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, సురేంద్రనాథరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సత్యంరెడ్డి, పురం సుబ్రమణ్యం, పామిడి మహేష్, మనోజ్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ

రాయచోటి టౌన్ : రాయచోటి డివిజన్ పరిధిలోని నూతనంగా డీఎస్సీ ద్వారా వచ్చిన ఉపాధ్యాయులకు ఈ నెల 19వ తేదీన రాయచోటి డైట్ కళాశాల ఆర్‌జేయూపీ ఆధ్వర్యంలో అవగాహన (శిక్షణ) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్‌జేయూపీ జిల్లా ప్రెసిడెంట్ సిద్దయ్య, జాయింట్ సెక్రటరీ సి.చంద్రశేఖరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఉంటుందని చెప్పారు.

పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం

- నకిలీ మద్యంతో సామాన్యుల ప్రాణాలు తీస్తారా?
- అక్రమ కేసులతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు వేధింపు
- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


మర్రిపాడు గ్రామసభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గుర్రంకొండ: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసి నిరుపేద విద్యార్థులకు వైద్య విద్యను టీడీపీ ప్రభుత్వం దూరం చేస్తోందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం మండలంలోని మర్రిపాడు, రామాపురం, మర్రిమాకుల పల్లె గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్య దరి చేరుతున్న సమయంలో 17 మెడికల్ కళాశాలలను టీడీపీ ప్రభుత్వం ప్రైవేట పరం చేయడం దారుణమన్నారు. పలు కళాశాలలో ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేసుకొన్నాయని అన్నారు. ఇలాంటి సమయంలో వాటిని సంతలో పశువులను అమ్మినట్లు ప్రైవేట్ పరం చేయడం న్యాయమేనా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 16 నెలలుగా నకిలీ మద్యం రాజ్యమేలుతూ సామాన్యుల ప్రాణాలను హరిస్తోందన్నారు. నకిలీ మద్యం సామ్రాజ్యం ములకలచెరువు నుంచి దక్షణాఫ్రికా వరకు విస్తరించిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. ములకలచెరువులో నకిలీ మద్యం విషయం ఎక్సైజ్ అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో రాష్ట్రంలో అమూల్ పాల డైరీలను తీసుకొచ్చి రైతులకు ఎంతో మేలు చేశారన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఒక లీటరుకు రూ. 4 నుంచి రూ.5 వరకు తగ్గించి పాడిరైతుల పొట్టకొడుతోందన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం తీసేసి లోకేష్ రాసిన రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని విమర్శించారు. పెద్దిరెడ్డి కుటుంబంపై కక్ష గట్టి వారి ఇళ్లు, కార్యాలయాలపై అన్యాయంగా దాడులు చేయిస్తున్నారన్నారు. పోలీసులను అడ్డంపెట్టుకొని వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమంగా కేసులు పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గ్రాఫ్ రోజురోజుకు పడిపోతోందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రైతులు పండించిన ఒక్క పంటకు కూడా గిట్టుబాటు ధరలు లభించక రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. అన్ని వేళలా కార్యకర్తలకు అందుబాటులో ఉండి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ కార్యదర్శి రాహుల్ చక్రవర్తిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్లు ముక్తియార్ ఆలీఖాన్, నీళ్ల భాస్కర్, మాజీ ఎంపీపీలు నక్కాచంద్రశేఖర్, జమీర్‌ఆలీఖాన్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు వెంకట శివారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రెడ్డిరాజా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవినాయక్, ఎంపీటీసీలు రాజగోపాల్, రాజశేఖర్‌రెడ్డి, ఖదీర్, సర్పంచ్‌లు చింతిర్లనాగేంద్ర, మస్తాన్‌రెడ్డి, జగన్మోహన్, మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎల్వీ రమణ, మాజీ వైస్ ఎంపీపీ రెడ్డినరసింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆకుల రెడ్డెప్ప, నీళ్లశ్రీనివాసులు, నాయకులు శ్రీనివాసులురెడ్డి, రెడ్డికుమార్, సురేష్, గణేష్, మునీర్, నూర్, శివశంకర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్వీ రమణ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం


రామసముద్రంలో కార్యకర్తలు, నాయకులతో నిసార్ అహ్మద్

రామసముద్రం : కల్తీ మద్యంతో మద్యం ప్రియుల ప్రాణాలకు ముప్పుతో పాటు కిడ్నీ సమస్యలు, అకాలమరణం సంభవిస్తున్నాయని వాటిపై రచ్చబండ.. కోటి సంతకాల ఉద్యమం ద్వారా పోరాటం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ పిలుపునిచ్చారు. ఆయన రామసముద్రం మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలో గడప గడపకు వెళ్లి కల్తీ మద్యంపైన ప్రజలకు అవగాహన, మెడికల్ కాలేజీల పీపీపీ విధానానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టడంపై నాయకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. రామసముద్రం మండలలో నిర్వహించే రచ్చబండ, కోటి సంతకాల సేకరణలో స్థానిక నాయకుల అభిప్రాయం మేరకు ప్రణాళిక ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు పివి.మిథున్ రెడ్డి, అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డి ఆదేశాల మేరకు మదనపల్లె నియోజకవర్గంలో ఇంటింటికి కూటమి పాలన వైఫల్యాలు తీసుకుని వెళ్లడం జరుగుతుందన్నారు. చంద్రబాబునాయుడు సీఎం అయిన తరువాత మెడికల్ కాలేజీలను పూర్తి చేయడానికి మనసు రావడం లేదని, జగన్మోహన్ రెడ్డి అన్ని సదుపాయాలు సమకూర్చినా పేదలపై కక్ష పెంచుకున్నారని విమర్శించారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీలు పూర్తి చేయడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. పీపీపీ వల్ల తన మనుషులకు లాభం చేకూర్చాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం తన వైఖరి మార్చుకుని, పిపిపి విధానానికి స్వస్తి పలకాలని సూచించారు. నవంబర్ 25న జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో గవర్నర్‌కు కోటి సంతకాలను అందజేస్తామన్నారు. మేధావి వర్గాలు, ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు సంతకాల సేకరణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆర్థిక నిర్ణయం భవిష్యత్‌ను తీర్చిదిద్దే గొప్ప ఆయుధం


మాట్లాడుతున్న డాక్టర్ నాగార్జున

కురబలకోట: వ్యక్తికైనా, వ్యవస్థకైనా చివరకు దేశ భవిష్యత్ అయినా వారు తీసుకునే ఆర్థిక నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందని ముంబై సెక్యూరిటీస్ మార్కెటింగ్ ట్రైనర్ బి. నాగార్జున అన్నారు. అంగళ్లులోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో యువ పౌరుల ఆర్థిక విద్య, సెక్యూరిటీ మార్కెట్ అంశంపై రెండు రోజుల పాటు వర్క్‌షాపు నిర్వహించారు. శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఆర్థిక విషయాలే ఎక్కువ ప్రభావవంతంగా పనిచేస్తాయన్నారు. డబ్బు పరంపరగా చేతులు మారడమే కాదు జీవితాలను మార్చే శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటుందన్నారు. సమయం, సమాచారం, సరైన నిర్ణయం ఆర్థికంగా విజయం సాధించడానికి దోహదపడతాయన్నారు. డబ్బు పక్కన విలువ గౌరవం, పలుకుబడి వచ్చి చేరుతాయన్నారు. ఇది ప్రతిష్ట, అధికారంతో పాటు అరుదైన అవకాశాల తలుపులు తెరుస్తుందన్నారు. వివేకం వివేచనతో పెట్టుబడులు పెట్టాలన్నారు. స్టాక్ మార్కెట్లు, మ్యూచివల్ ఫండ్స్, షేర్లు, బాండ్లు తదితర వాటిపై పక్కా అవగాహన ఉండాలన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కూడా సెక్యూరిటీస్ మార్కెట్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. యువత ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అవగాహనతో ముందుకు సాగాలన్నారు. భవిష్యత్తును నిర్మాణం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు పంపాలి

జెడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు


ఉన్నత పాఠశాల సమస్యలపై హెచ్‌ఎంతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో

పెద్దమండ్యం: మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఏమైనా ఉంటే ప్రతిపాదనలు పంపాలని జెడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు అన్నారు. పెద్దమండ్యం ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, జెడ్పీటీసీ పీరమ్మ ఇటీవలసీఈవో దృష్టికి తీసుకుపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఈవో ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పాఠశాల ముందు భాగంలో ఇటీవల కూలిన ప్రహరీని, అలాగే పాఠశాల వెనుక భాగంలో ప్రహరీ నిర్మాణం చేపట్టే ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్‌రావు, హెచ్‌ఎం భాగ్యమ్మ, పీఆర్ ఏఈ షాబాజ్ పాల్గొన్నారు.

టపాసుల దుకాణ దారులు నిబంధనలు పాటించాలి


టపాసుల దుకాణాలను పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్ఐ

తహసీల్దార్ ధనుంజయులు

కురబలకోట: మండలంలోని అంగళ్లు టమాటా మార్కెట్‌లో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను ముందస్తుగా తహసీల్దారు ధనుంజయులు, ఎస్ఐ దిలీప్‌కుమార్ శుక్రవారం సంయుక్తంగా పర్యవేక్షించారు. భద్రత, నిబంధనలను ఖచ్చితంగా అనుసరించి దుకాణాలు నిర్వహించాలన్నారు. విద్యుత్ వైరింగ్, అగ్ని భద్రతా ఏర్పాట్లు, నీటి డ్రమ్ములు తదితర వాటిని సమగ్రంగా పరిశీలించారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా దుకాణాలు నిర్వహించాలన్నారు. పండగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆర్ఐ శేషాద్రి, వీఆర్వో ఖాదర్‌బాషా, తెట్టు ఓ. రెడ్డిశేఖర్, శ్రీహరి, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడికి నిరసన


ములకలచెరువు: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


గుర్రంకొండ: తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ములకలచెరువు: సుప్రీంకోర్టు సీజేఐ గవాయ్‌పై దాడికి వ్యతిరేకంగా మండలానికి చెందిన ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్పీ నాయకులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ప్రదీప్‌కు వినతి పత్రం అందజేశారు. సీజేఐపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌కుమార్, తిరుపాల్, మల్లికార్జున, విజయ్‌కుమార్, శ్రీరాములు. కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

గుర్రంకొండ: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేసినన వ్యక్తిపై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ లక్ష్మీప్రసన్నకు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడి చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే అన్నారు. దళితవర్గానికి చెందిన గవాయ్‌పై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో ఎమార్పీఎస్ నాయకులు ప్రసాద్, రెడ్డిఅంజినేయలు, వెంకట్రమణ, రెడ్డెప్ప, నరసింహులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


కాలేజీ ఆవరణంలో పిచి మొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం కాలేజీ ఆవరణంలో విద్యార్థులు పిచ్చిమొక్కలు, పరిసరాలను శుభ్రం చేశారు. కాలేజీ ఆవరణం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆవరణంలో పూల మొక్కలు, మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే కాలేజీలో ఆధార్ అప్‌డేషన్ జరుగుతున్నట్లు తెలిపారు.

పాఠశాలకు మంచి పేరు తేవాలి

–విద్యార్థులతో డీవైఈఓ లోకేశ్వర్‌రెడ్డి


విద్యార్థులకు సూచినలిస్తున్న లోకేశ్వర్‌రెడ్డి

బి.కొత్తకోట: విద్యార్థులు చదువుకున్న పాఠశాలకు మంచిపేరు తెచ్చేలా విద్యలో రాణించాలని మదనపల్లె డీవైఈవో లోకేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక బాలికల జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థినిలతో ముచ్చటించారు. గతంలో ఈ పాఠశాలలో చదివిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి ర్యాంకులు తెచ్చారు, మీరు కూడా మంచి ర్యాంకులు తీసుకురావాలని కోరారు. అందుకు తగిన శ్రమ, ప్రణాళిక అవసరమని సూచించారు. సందేహాలను నివృత్తి చేసుకునే విషయంలో మీ ఉపాధ్యాయుల దృష్టికి తేవాలన్నారు. ఈ విషయంలో ఏలాంటి నిర్లక్ష్యం చూపొద్దని కోరారు. తర్వాత ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో విద్యార్థులకు అర్థమయ్యేలా, వారిలో అవగాహన పెంచేలా బోధన జరగాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన విద్యార్థినులను గుర్తించి వారిపట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. ఎంఈఓలు ఆర్.రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారీ, హెచ్‌ఎం భాస్కర్, ఉపాధ్యాయులు ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు సద్వినియోగం చేసుకోవాలి

ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం బి. వెంకటమోహన్


వినాయక ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కేవీపల్లె : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం బి. వెంకటమోహన్, పీలేరు ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. శుక్రవారం కేవీపల్లెలో శ్రీ వినాయక ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం (బయో రీసెర్చ్ సెంటర్) ప్రారంభించారు. కేంద్రం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ పంటల రక్షణ, తెగుళ్ల నివారణకు అవసరమైన కషాయాలు, ద్రావణాలు, లింగ ఆకర్షణ బుట్టలు, పసుపు–తెలుపు అట్టలు వంటి సేంద్రియ సాధనాలు, కిచెన్ గార్డెన్‌కి అవసరమైన విత్తనాలు ఇక్కడ లభిస్తాయని తెలిపారు. అలాగే ద్రవజీవామృతం, భీజామృతం లభిస్తాయని రైతులు సద్వినియోగం చేసుకుని ప్రకృతి స్నేహపూర్వక వ్యవసాయం చేయాలని కోరారు. రైతులకు సీజన్‌కు అనుగుణంగా పంట మార్పిడి చేయాలని తెలిపారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలి


ప్రకృతి వ్యవసాయ పంటను పరిశీలిస్తున్న వెంకటమోహన్, తదితరులు

కలికిరి(వాల్మీకిపురం): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలని పీఎండీఎస్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ సూచించారు. వాల్మీకిపురం మండలంలోని అయ్యావారిపల్లి, చింతపర్తి, నగిరిమడుగు పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేసిన పంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఏడాది పొడవునా కూరగాయల మోడల్, నిరంతర ఆదాయం వచ్చే మోడల్, 32 రకాల విత్తనాలతో వేసిన పీఎండీఎస్, వరి పంట మోడల్ తదితరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ఆయన రైతులను విచారించారు. మోడల్స్ సాగుతో లభించిన ఆదాయం, సాగు ఖర్చు ఎంత తగ్గుదల తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రబీ డ్రై సోయింగ్‌పై రైతులకు తెలియజేశారు. అధికారులు ఆదిత్య రామ్, పవన్, మస్టర్ ట్రైనర్ సుబ్బరామయ్య, స్వాతి, సావిత్రి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నత్తల నివారణ చర్యలు చేపట్టాలి


బొప్పాయి పంటలో నత్తలను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కలికిరి: నత్తల నివారణకు చర్యలు చేపట్టాలని కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండల పరిధిలోని అసిపిరెడ్డిగారిపల్లి, కొర్లకుంట ప్రాంతాల్లో శుక్రవారం బొప్పాయి, టమాటా, వంగ, బూడిదగుమ్మడి తదితర పంటలను పరిశీలించిన వారు రైతులకు నత్తల నివారణపై సూచనలు, సలహాలిచ్చారు. వర్షాలు కురుస్తుండటంతో నత్తలు పగటి పూట తేమ ప్రాంతాల్లో కలుపు మొక్కల్లో ఉండి రాత్రి పూట పంటలను ఆశించి ఆకులను, పూతను, కాయల్ని తిని తీవ్రంగా నష్టపరుస్తాయన్నారు. నర్సరీలలో సైతం నారును నష్టపరుస్తాయన్నారు. వీటి నివారణకు రైతులు సమష్టిగా కృషి చేయాల్సి ఉంటుందన్నారు. పొలం చుట్టూ కలుపు మొక్కలు ఉండకుండా నిర్మూలించాలని, పొగాకు పొడర్ ఒక ఎకరానికి 15 కిలోలు ఆఖరి దుక్కిలో వేయాలన్నారు. విషపు ఎరలు తయారు చేసి పొలాల్లో అక్కడక్కడా ఉంచాలని సూచించారు. అలాగే ఇతర పొలాలకు వ్యాప్తి చెందకుండా గట్ల పైన, పొలం చుట్టూ ఉప్పు ద్రావణంలో ముంచిన గోనె సంచులను వేయవచ్చని తెలిపారు. మల్చింగ్ సీట్ వేయడం వలన కూడా వీటి వ్యాప్తి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు పీరూ సాహెబ్, సోమశేఖర్ బాబు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి రామక్రిష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల ప్రతిభ


బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

పీలేరురూరల్ : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పీలేరు సీఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి ద్వితీయ స్థానం సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ చింతల విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. తమ కళాశాలలో క్రమశిక్షణతో కూడిన విద్య తోపాటు క్రీడలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చిన కోచ్ అవినాష్‌ను అభినందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులు విష్ణువర్ధన్, మహమ్మద్ అలీ, ఖుషీ, అబుబకర్‌వసీంలను అభినందించారు.

డాక్టర్ శ్రీలతకు ఉత్తమ గైనకాలజిస్టు అవార్డు


అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్రీలత

పీలేరు : పీలేరు ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న డాక్టర్ శ్రీలతకు ఉత్తమ గైనకాలజిస్టు అవార్డు లభించింది. శుక్రవారం కలెక్టర్ నిశాంత్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాల్లో ఉత్తమ సేవలందించినందుకు గానూ ప్రశంసాపత్రం లభించింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ అవార్డు తనకు మరింత బాధ్యత పెంచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐవో ఉషశ్రీ, డీఎం అండ్ హెచ్‌వో లక్ష్మీనరసయ్య, డెమో అధికారి దేవశిరోమణి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైనే చేపల విక్రయాలు



చిత్తూరు బస్టాండు రోడ్డుపై చేపల విక్రయాలు

దుర్వాసతో అల్లాడుతున్న ప్రజలు

మదనపల్లె సిటీ: పట్టణ నడిబొడ్డున ఉన్న చిత్తూరు బస్టాండు వద్ద రోడ్డుపైనే చేపల విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో దుర్వాసతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పరిసర ప్రాంతాలు వ్యర్థాలు పడివుండటంతో కంపుకొడుతోంది. ఆదివారం అయితే నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. గతంలో చేపల మార్కెట్‌ను వారపుసంతలోని రైతుబజారులో ఏర్పాటు చేయాలని భావించారు. అది కార్యచరణకు నోచుకోలేదు. చేపల మార్కెట్‌ను ప్రత్యేకంగా స్థలం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.